విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 12, జులై 2024

# అనంతపోరాట యోధుడు.. వెంగమనాయుడు

- 1950లో కమ్యూనిస్టు పార్టీలో చేరిక...
- 1972 నుంచి 1992వరకు జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు
- 1997లో దారుణ హత్యకు గురైన ప్రజా నాయకుడు
- 12న 26వ వర్ధంతి ▸జయప్రదం చేయాలి సీపీఐ నాయకుల పిలుపు

**విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం :** అనంతపురం జిల్లాలో సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు పి.వెంగమనాయుడు 20ఏళ్ళ జిల్లా పార్టీ కార్యదర్శిగా పనిచేశాడు. ఈయన పూర్తి పేరు పెనకలపాటి వెంగమ నాయుడు అనంతపురం జిల్లా పెద్దపప్పురు మండలం చీమలవాగుపల్లి గ్రామంలో హనుమంతప్ప, బాలమ్మ దంపతులకు 1926 ఆగస్టు 26వ తేదీన జన్మించారు. భార్య నారాయణమ్మ చీమలవాగుపల్లి లో ఐదవ తరగతి వరకు చదివి ఆ తర్వాత సొంతంగా ఇంగ్లీష్ నేర్చుకొని చదివి అర్థం చేసుకోగల స్థితికి చేరుకున్నారు. 1950లో కమ్యూనిస్టు పార్టీలో చేరారు. అంతకు ముందు కమ్యూనిస్టు పార్టీపై నిషేధం న్న రోజులలో కమ్యూనిస్టు పార్టీ నాయకులకు ఇంట్లో ఆశ్రమం ఇచ్చి వారికి అవసరమైన సహాయ సహకారాలు అందజేవారు. వెంగమ నాయుడిది చిన్న రైతు కుటుంబం. మొదట స్వగ్రామానికి 10-15కిలోమీటర్లు దూరంలో ఉన్న నవరాయి గనుల నుంచి నాపరాళ్ల బండ్లు ఎత్తుకొని 150కిలోమీటర్ల దూరంలో ఉన్న బళ్లారిలో అమ్ముకొనే నిమిత్తం వాళ్ళ నాన్నతో పాటు వెళ్లేవారు. దాంట్లో మిగిలిన డబ్బులతోనే జీవనం సాగించే వాడు. వారికి ఉన్న పది ఎకరాల మెట్ట పొలాన్ని సొంతంగా సాగు చేసుకునే వారు. వెంగమ నాయుడు అత్యంత ధైర్యశాలి. ఎన్నో సార్లు శత్రువుల భారీ నుండి బయటపడ్డారు. ఎదురుగా శత్రువు వస్తున్నా పిరికితనంతో పారిపోకుండా వాళ్లు నన్ను ఏం చేస్తారు రా అని ధైర్యం గా ముందుకెళ్లేవారు. లింగం నాయుడు చాలా నిరాడం బరుడు. ఎంత దూరమైన కాలి నడకన వెళ్లేవారు. లేదా సైకిల్ వాడేవారు. తాడిపత్రి అనంత పురంలో కూడా నాడక లేదా అద్దె సైకిల్ వాడేవారు. రిక్షా ఆటోలలో ప్రయాణించడం చాలా అరుదు. హైద రాబాద్ వెళ్లినా అక్కడ కూడా కాలినడకన లేదా సిటి బస్సులలో మాత్రమే ప్రయాణించి ఆర్థిక క్రమశిక్షణ పాటించేవారు. వాళ్ల సంతతి కూడా మీ బ్రతుకులు మీరు బ్రతకండి చేతనైన మేరకు చదివింను అనే వారు. నేను మీకు ఇంతకంటే ఏమీ ఇవ్వలేను అని మీరు నాకు ఏమి ఇవంకరలేదు అని చెప్పేవారు. 1950లో కమ్యూనిస్టు పార్టీలో చేరిన వెంగమనాయుడు పార్టీ కార్యక్రమాలు రహస్యంగా ప్రారంభిం చారు. ఆ రోజుల్లో చీమల వాగుపల్లెలో వ్యవసాయ కార్మిక సంఘం ప్రథమ మహాసభలు జరపడానికి ఏర్పాట్లు చేశారు. సీనియర్ కమ్యూనిస్టు నాయకులు వికే.ఆదినారాయణ రెడ్డి మరికొందరు కమ్యూనిస్టులు ముఖ్యుల హాజరైనారు. పోలీసుల మహాసభపై దాడి చేసి కాల్పులు కూడా జరిపారు. వెంగమ నాయుడు మిగిలిన కమ్యూనిస్టు నాయకులు పోలీసులు కళ్ళు గప్పి తప్పించుకున్నారు. 1952లో పార్టీపై నిషేధం తొలగిన తర్వాత తాడిపత్రి తాలుకా సిపిఐ కార్యదర్శిగా బాధ్య తలు నిర్వర్తించారు. తదుపరి జిల్లా పార్టీలో చురు కుగా పనిచేసి అనేక కార్యక్రమాలు నిర్వహిం చారు. 1960వ దశకంలో కమ్యూనిస్టు పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు బంజర భూములు, దేవాదాయ భూముల పోరాటంలో పాల్గొని సుమారు మూడు నెలల పాటు గుత్తి సబ్‌జైల్‌లో శిక్షణ అనుభవించారు. కమ్యూనిస్టు పార్టీతో సంబం ధాలు ఏర్పడ్డాక ఆ పార్టీలో చేరిక ప్రజా సమస్యల పైన పనిచేసే వారు. చీమల వాగు పల్లెలో పేద ప్రజల కోసం కో-ఆపరేటివ్ సొసైటిని స్థాపించి దాని ద్వారా వ్యవసాయ కార్మికులకు, రైతులకు అప్పులు ఇప్పించి దాదాపు 15సంవత్సరాలు సొసైటి సమస్తవం తంగా నిర్వహించి జిల్లాలో ఉత్తమ సొసైటిగా తీర్చిదిద్దారు. సొసైటి ద్వారా నే చౌక డిపోను కూడా ప్రారంభించి 10సంవత్సరాలు నిత్యవసర వస్తువులను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే సక్రమంగా పంపిణీ చేశారు. 1972లో అనంత పురం జిల్లా కార్యదర్శిగా ఎంపికై ఆ బాధ్యతలతో 1992వరకు నిర్విఘ్నంగా కొనసాగారు. ఆయన కార్యదర్శులు ఉన్న కాలంలో కౌకుంట్లలో భూపోరాటం జరిపిన ఫలితంగా భూస్వాములు పయ్యావుల వెంకటనారాయణ భూములను అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు స్వయంగా వచ్చి భూ సమారాధన ద్వారా పంపిణీ చేశారు. యాడికి కాలవ, పిన్నేపల్లి చెరువు నీటి కోసం రైతులను, ప్రజలను సమీకరించి పోరాడారు. 1977లో జరిగిన ఒక భూ పోరాట సందర్భంగా ఆయనపై ప్రత్యర్థులు తుపాకి కాల్పులు జరిపారు. కోనపుల్పాడులో పోరంబోకు స్థలం పేదలకు పంచాలని భూ పోరాటం చేసి అరెస్టు కాబడ్డి జైలుకు వెళ్లారు. 1991లో జిల్లా ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటంలో ఆయన తాడిపత్రి ప్రాంతంలో విరోచితంగా పాల్గొన్నారు. మూతపడిన గుంతకల్లు స్పిన్నింగ్ మిల్లు తెరిపించడానికి అనేక పోరాటాలు నిర్వహిం చారు. గుంతకల్లులో రౌడీలు ఆగడాలు పెరిగిపోయిన సందర్భంగా గుంతకలు సినీ కార్మికుల సంఘం నాయకుడిగా జిల్లా వ్యాప్తంగా కార్యకర్తలను సమీకరించి రౌడీలకు వ్యతిరేకంగా ఉద్యమించి రౌడీయిజం నియంత్రించారు. దీంతో భూస్వాములు పెట్టుబడి దారులు ఆయనపైన కత్తి కట్టారు. పెద్దల 1997 జూలై 12న వెంగమ నాయుడును అనంతపురంలో పట్టపగలు భూస్వామ్య వర్గాలు కిరాయి గూండాలు దారుణంగా హత్య చేశారు. వెంగమనాయుడు తన జీవితంలో ప్రజా సమస్యలపై పట్టుదలతో పనిచేసే ప్రజల కోసం జీవించిన మనిషిగా చరిత్రలో నిలిచారు.

## ముస్లిం మహిళల భరణంపై సుప్రీం కోర్టు తీర్పు సీపీఐ జిల్లా స్వాగతిస్తోంది..

### సీపీఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్

**విశాలాంధ్ర-అనంతపురం:** విడాకులు తర్వాత ముస్లిం మహిళలు కూడా భరణానికి అర్హులని స్పష్టం చేసింది. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సీఆర్‌పీసీ సెక్షన్ 125 ప్రకారం విడాకులు తీసుకున్న భార్యకు భరణం చెల్లించాలంటూ ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ ఓ ముస్లిం వ్యక్తి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు . దీనిని జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ అగస్టిన్, జార్జ్ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం కొట్టి వేసిందని భారత కమ్యూనిస్టు పార్టీ, సిపిఐ జిల్లా కార్యదర్శి సిజాఫర్ గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. విడాకుల తర్వాత తమ భర్త నుంచి వారు భరణం కోరవచ్చని తీర్పునిచ్చింది అన్నారు. భరణానికి సంబంధించిన హక్కును కల్పించే ఆ సెక్షన్ విడాకులు తీసుకున్న ముస్లిం మహిళలకు వర్తింపజేస్తున్నట్లు తెలిపిందన్నారు. సెక్షన్ 125 వివాహితలకే కాకుండా మహిళలందరికీ వర్తిస్తుంది అని మతంతో సంబంధం లేకుండా ఈ సెక్షన్ కింద వివాహితులు భరణం కోరవచ్చు అని తెలియజేయడం జరిగిందన్నారు భరణం ఇవ్వడం అనేది దాతృత్వం లేదా విరాళం కాదన్నారు. భార్య తమపై మానసికంగా ఇతర రకాలుగా ఆధారపడి ఉంటుందని వాస్తవాన్ని కొందరు భర్తలు గుర్తించడం లేదన్నారు. గృహిని పాత్రను, ఆమె త్యాగాన్ని గుర్తించాల్సిన సమయం వచ్చింది అని ధర్మాసనం తీవ్రంగా స్పందించిందన్నారు. ఇంటి పట్టున ఉంటూ భార్య తమపైనే ఆధార పడి ఉంటుందన్న కనీస ఇంగితం కూడా కొంతమంది భర్తలకు ఉండడం లేదు అని తెలియజేయడం జరిగిందన్నారు. భావోద్వేగ పరంగా కూడా అలాంటి మహిళలు భర్త పైనే ఆధారపడి ఉంటారన్నారు. ఇప్పటికైనా గృహినిల విలువ వాళ్ళెంత త్యాగం చేస్తున్నారో పురుషులు అర్థం చేసుకోవాలి అని సుప్రీంకోర్టు ధర్మాసనం పిటిషనర్లకు చివాట్లు పెట్టిందని పేర్కొన్నారు. తగిన ఆదాయ మార్గాలు కలిగి ఉన్న వ్యక్తి తన భార్య పిల్లలు లేదా తల్లిదండ్రులకు భరణాన్ని తిరస్కరించలేరని సెక్షన్ 125 చెబుతోందన్నారు.

## పారదర్శకమైన పాలనను ప్రజలకు అందిస్తాం..

### రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

బాధ్యతలు స్వీకరిస్తున్న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

**విశాలాంధ్ర-ఉరవకొండ:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారధ్యంలో జవాబుదారితనంతో కూడిన పారదర్శకమైన పాలన రాష్ట్ర ప్రజలకు అందించేందుకు కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయంలోని రెండో బ్లాక్లో తన చాంబర్లో కేశవ్ ఆర్థిక మంత్రిగా బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయం అధికారులు మంత్రి పయ్యావుల కేశవ్‌కు అభినందనలు తెలియజేశారు.

## మొక్కను నాటండి.. అది పెరిగే వరకు సంరక్షించండి : డీఎఫ్ఓ

**విశాలాంధ్ర-అనంతపురం:** ప్రతిఒక్కరూ ఒక మొక్కను నాటాలి.. అది పెరిగే వరకు సంరక్షించాలని జిల్లా అటవీశాఖ అధికారి వినీత్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం అటవీ శాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవం మరియు తలి పేరు మీద ఒక చెట్టు కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరు మండలంలోని పంపనూరు నగరవనంలో చెట్లు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎఫ్ఓ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నామని, మొక్కలు నాటేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలన్నారు. అంతేకాకుండా అనంతపురం, గుత్తి రేంజ్ లో పలు చోట్ల అటవీశాఖ అధికారులు చెట్లు నాటించారు.

## కస్తూర్బాలో కుళ్ళిన కూరగాయలు

### పరిశీలించిన టీడీపీ నాయకులు

**విశాలాంధ్ర-ముదిగుబ్బ :** మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో సమస్యలు తిష్ట వేసుకున్నాయని తెలుసుకున్న టిడిపి మండల క్లస్టర్ ఇంచార్జ్ తుమ్మల మనోహర్ గురువారం కస్తూర్బా పాఠశాలను భోజన సమయంలో పరిశీలించారు, భోజనం, కూరలను పరిశీలించి, భోజనం మెనూ ప్రకారం అందుతుందా, నాణ్యమైన భోజనం పెడుతున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. స్టోర్ రూమ్ పరిశీలించగా స్టోర్ రూమ్‌లో కూరగాయలు కుళ్ళిపోయి దుర్వాసన వస్తుండడంతో వాటిని పరిశీలించారు. మండల క్లస్టర్ ఇంచార్జ్ తుమ్మల మనోహర్ మాట్లాడుతూ కస్తూర్బా పాఠశాలలో గత వైసిపి ప్రభుత్వంలో నుండి తీవ్ర సమస్యలు తిష్ట వేశాయని, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, టిడిపి ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ ధర్మవరం నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజక వర్గంలో తీర్చిదిద్దాలని కృషి చేస్తున్నారని, అలాంటి తరుణంలో కస్తూరిబా పాఠశాలలో ఇలా కుళ్ళిన కూరగాయలను పిల్లల భోజనాలలో ఎలా వాడుతున్నారని, ఏ జంతువు కూడా వాటిని తినవని అలాంటిది పిల్లలకు మీరు ఎలా పెడుతున్నారు అంటూ సిబ్బందిని నిలదీశారు. ఇలాంటి కూరగాయలతో భోజనం పెడితే విద్యార్థుల ఆరోగ్యం దెబ్బతింటుందని, విద్య, ఆరోగ్యం పై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, విద్యార్థుల ఆహార విషయంలో ఇలా ప్రవర్తించడం సమంజసం కాదన్నారు. వీటిపై ధర్మవరం టిడిపి ఇంచార్జిజ పరిటాల శ్రీరామ్ ద్వారా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. అనంతరం ఎంఈఓ రమణప్పకు సమాచారం అందించగా ఎంఈఓ హుటాహుటిన కస్తూర్బా పాఠశాలకు చేరుకుని కస్తూరిబా సిబ్బందిపై మండిపడ్డారు. సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గోపాల్‌రెడ్డి, మల్లెల నారాయణ స్వామి, రంగనాయకులు, నారాయణస్వామి, గోపాల్ పాల్గొన్నారు.

## ఉద్యాన పంటలతో లాభం

**విశాలాంధ్ర-బొమ్మనహాల్:** ఉద్యానవన పంటల సాగు రైతులకు మంచిదిగుబడిస్తుందని, దీంతో రైతులు ఉద్యాన పంటల పెంపకంపై దృష్టి సారించాలని జిల్లా ఉద్యానశాఖాధికారి ఫిరోజ్ ఖాన్, డీఆర్‌ఐపీ పీడీ రఘునాథ్ రెడ్డిలు అన్నారు. గురువారం బొమ్మనహాళ్ మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో రైతు మారుతి ప్రసాద్ సాగు చేసిన అల్ల నేరేడు చెట్లును, నేరేడు పండ్ల ద్వారా తయారు అయ్యే జామ్, జ్యూస్ తయారి విధానాన్ని పరిశీలించారు. నేరేడు పండ్ల దిగుబడి, జ్యూస్ తయారీ విధానం పరిశీలించారు.

## నాణ్యమైన విద్య మనందరి నినాదం కావాలి

### బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి పనిలో కాదు

### కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

**విశాలాంధ్ర-అనంతపురం :** నాణ్యమైన విద్య.. మనందరి నినాదం కావాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఎంఈఓలతో అన్నారు. అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో గురు వారం విద్యాశాఖ పరిధి లోని నేను బడికి పోతా, అకడమిక్ మానిటరింగ్ వింగ్, సివిల్ ఇంజనీరింగ్ పనులు, మధ్యాహ్న భోజనం, నాడు-నేడు, అదనపు తరగతి గదులు, తదితర అంశాలపై ఎంఈఓలు, విద్యాశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

కలెక్టర్ మాట్లాడుతూ విద్యాశాఖ పరిధిలోని అన్ని మండలాల్లోనూ ఎంఈఓలు ఒకేస్థాయి పనితీరు కనబరిచాలని, వారి పనితీరు మరింత మెరుగుపడాలని ఆదేశించారు. పనితీరులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరా దన్నారు. కే.జి.బి.వీలలో పదవ తరగతి ఉత్తీర్ణత శాతం తక్కువగా ఉందని, ఇంటర్ మొదటి సంవత్సరం ఉత్తీర్ణత శాతం తక్కువ ఉందని, ప్రతి ఏడాది తగ్గుతోందని, ప్రత్యేక దృష్టి సారించి ఉత్తీర్ణత శాతం మరింత పెంచాలని ఆదేశించారు. "నేను బడికి పోతా" కార్యక్రమంలో భాగంగా బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలేకానీ పనిలో ఉండకుండా చూడాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. పామిడి మండలంలో 87 హ్యాబిటేషన్లలో, ఉరవకొండ మండలంలో 84 హ్యాబిటేషన్లలో ఈ కార్యక్రమం కింద చేపట్టగా, సెట్టూరు మండలంలో కేవలం ఒక హ్యాబిటేషన్ లో ఈ కార్యక్రమం చేపట్టారని, అలా ఎక్కువ తక్కువ కాకుండా అన్ని మండలాల్లోనూ పూర్తిగా ఈ కార్యక్రమం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమం కింద మొత్తం 3,356 మందిని గుర్తించగా, ఉరవకొండలోనే 1,617 మందిని గుర్తించారని, మిగిలిన చోట్ల ఎందుకు గుర్తించలేదని ప్రశ్నించారు. సి.డబ్ల్యు.ఎస్.ఎన్ కింద బుక్కరాయ సముద్రంలో మాత్రమే ముగ్గురిని గుర్తించారని, మిగిలిన చోట్ల గుర్తించలేదని, చిన్నారుల ఎన్రోల్మెంట్ ప్రక్రియను కూడా ఎలాంటి పెండింగ్ లేకుండా వచ్చేవారం లోపు 100 శాతం పూర్తి చేయాలని ఎంఈఓలను ఆదేశించారు. బడిలో చదవాల్సిన పిల్లలు చదువుకునేలా జిల్లా అంత ఈ కార్యక్రమం చేపట్టాలని, కానీ కొన్ని మండలాలే ఈ కార్యక్రమాన్ని పూర్తిచేశాయి తప్ప మిగతా మండలాలు ఎందుకు పూర్తి చేయలేదో చెప్పాలన్నారు. ఇకనుండి ప్రతిరోజు రిపోర్టును పంపాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమం కింద పోస్టర్ల ఆవిష్కరణ, డాక్యుమెంటరీ ఫిల్మ్‌లను చేపట్టాలన్నారు.

అకడమిక్ మానిటరింగ్ వింగ్ కింద జ్ఞాన జ్యోతి కార్యక్రమంలో భాగంగా ఎస్జిటీలు, అంగన్వాడీ టీచర్లకు పూర్తిస్థాయిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని, షెడ్యూల్ వచ్చిన తర్వాత ట్రైనింగ్ చేపట్టాలన్నారు. జ్ఞాన ప్రకాష్ రిఫ్రెషర్ శిక్షణ కింద ప్రతి ఒక్కరికి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని, లక్ష్యం నిర్దేశించుకుని పనులు పూర్తి చేయాలని, వచ్చే ఆగస్టు ఒకటో తేదీ నాటికి శిక్షణ కేంద్రంలో పనులు మొదలు కావాలన్నారు. ఇంప్లిమెంటేషన్ ఆఫ్ స్పెషల్ ఎన్రోల్మెంట్ డ్రైవ్ అమలులో భాగంగా విద్య అవగాహన శిబిరాలు నిర్వహించడం, కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు, విద్యసౌకర్యాలు ప్రాముఖ్యతను పోస్టర్లు, డాక్యుమెంటరీల ద్వారా ప్రచారం చేయాలన్నారు., గతంలో పాఠశాలలో చదివి ప్రయోజకులుగా ఉన్న వారిని ఆదర్శంగా చూపాలని సూచించారు.

## గూడూరు బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా ముగియాలి

### పకడ్బందీ చర్యలు చేపట్టండి : ఎస్పీ

**విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం:** నార్పల మండలం గూగూడు బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా ముగిసేలా చర్యలు చేపట్టాలని ఎస్పీ గౌతమిసాలి ఆదేశించారు. ఈనెల 7 వ తేదీ నుండీ ప్రారంభమై ఈనెల 19 వరకు గూగూడు కుళ్లాయస్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ బ్రహ్మోత్సవాలలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కల్గకుండా మరియు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టడంలో భాగంగా జిల్లా ఎస్పీ గురువారం గూగూడు గ్రామాన్ని సందర్శించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా పెద్ద సరిగెత్తి, జలధి కార్యక్రమాలకు భక్తులు భారీ ఎత్తున గూగూడుకు తరలి వచ్చే అవకాశమున్నందున అందుకు తగ్గట్టుగానే భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ముందుగా... గూగూడులో వెలసిన శ్రీ కుళ్లాయస్వామి, శ్రీ ఆంజనేయ స్వామి వార్ల దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం.... ఆలయాల పరిసరాలను, అగ్నిగుండం, పికెట్లు, బందోబస్తు పాయింట్లు, గ్రామంలోని రహదారులు, పార్కింగు స్థలాలను పరిశీలించారు. గూగూడు బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా నిర్వహించడమే జిల్లా పోలీసుశాఖ లక్ష్యమన్నారు. స్థానిక పోలీసులతో పాటు జిల్లా హెడ్ క్వార్టర్స్ నుండీ ఏ.ఆర్ మరియు స్పెషల్ పార్టీ సిబ్బందిని ఇక్కడి విధుల్లో ఉంచుతామన్నారు. గూగూడులో 25 సిసిటీవీలు పని చేస్తున్నాయి. వీటిని అనుసంధానిస్తూ కమాండ్ కంట్రోల్ ఏర్పాటు చేస్తున్నా మన్నారు. పబ్లిక్ అడ్రెస్సింగ్ సిస్టం ద్వారా ఎప్పటికప్పుడు సూచనలు చేయడం మరియు అప్రమత్తం చేయడం జరుగుతుందన్నారు. భక్తులకు అసౌకర్యం కల్గకుండా ప్రత్యేక బృందాలు రంగంలో ఉంటా యన్నారు. మహిళలు, చిన్నారుల కోసం ప్రత్యేకంగా 24/7 విధుల్లో ఉండేలా మహిళా సిబ్బందిని కేటా యించామన్నారు. పిక్ ప్యాకెటింగ్ , దొంగతనాలు, తదితర నేరాలు జరుగకుండా క్రైం పార్టీలను రంగంలోకి దింపుతామన్నారు. గ్రామ ప్రజలు, భక్తుల సహకారంతో ఈ బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా జరిగేలా పకడ్బంధీ చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎస్పీతో పాటు అనంతపురం రూరల్ డీఎస్పీ బి.వి.శివారెడ్డి, నార్పల ఎస్సై రాజశేఖర్ రెడ్డి ఉన్నారు.

## ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం

### ర్యాలీని ప్రారంభించిన డీఎంహెచ్ఓ ఈ.బి. దేవి

**విశాలాంధ్ర-అనంతపురం:** ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం వైద్య మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల నుండి సప్తగిరి సర్కిల్ దాకా వివిధ నర్సింగ్ కళాశాలల విద్యార్థినీలు, ఇతర వైద్య సిబ్బందితో ర్యాలీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీ కార్యక్రమాన్ని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా.ఈబి.దేవి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం సప్తగిరి సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థినీలు వైద్య సిబ్బంది ప్రజల అవగాహన కోసం వివిధ నినాదాలతో హోరెత్తించారు.ముఖ్యంగా జనాభా పెరుగుదల దేశ అభివృద్ధికి అవరోధమని, చిన్న కుటుంబం చింతలేని కుటుంబం అని, జనాభా నియంత్రణతో పేదరికం నిర్మూలిద్దామని, అర్హులైన దంపతులు కుటుంబ నియంత్రణ పాటించాలని, వివాహ వయసు అమ్మాయికి 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరం నిండాలని, బిడ్డకు బిడ్డకు మధ్య ఎడం పాటించాలని, సంతోషం మరియు శ్రేయస్సు కోసం కుటుంబ నియంత్రణ పద్ధతి పాటించాలని, బాధ్యత గల భార్యాభర్తలు ఎవరంటే కుటుంబ నియంత్రణ పాటించేవారని, వివిధ నినాదాలతో ర్యాలీ కొనసాగించారు. అనంతరం సప్తగిరి సర్కిల్ నందు మానవహారంగా ఏర్పడి కుటుంబ నియంత్రణ పై ప్రజలకు అవగాహన కల్పించడంలో మేమందరం బాధ్యత తీసుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా.ఈబి.దేవి మాట్లాడుతూ 1989 వ సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం జూలై 11వ తేదీన ప్రపంచవ్యాప్తంగా జనాభా దినోత్సవం చేసుకోవడం జరుగుతుందని, "తల్లి మరియు బిడ్డ శ్రేయస్సు కోసం సరైన సమయంలో గర్భధారణ మరియు బిడ్డ బిడ్డకు అంతరం "అన్న లక్ష్యంతో," "కుటుంబ ప్రణాళిక అనేది కొత్త గుర్తింపు మరియు దంపతులకు గర్వకారణం" అన్న నినాదంతో ఈ సంవత్సరం ప్రపంచ జనాభా దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందని తెలియజేశారు. అంతేకాక ప్రపంచ జనాభా దినోత్సవం ఉద్దేశం పేదరికాన్ని, ఆరోగ్య పరిస్థితులను మెరుగుపరచడం మరియు విద్య ఆరోగ్య సంరక్షణ, మహిళలు, బాలికలకు సమాన అవకాశాలను ప్రోత్సహించడం ద్వారా స్థిరమైన అభివృద్ధిని ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుందని తెలియజేశారు. కుటుంబ నియంత్రణ కోసం రెండు పద్ధతులను అవలంబించవచ్చని తెలి పారు. తాత్కాలిక పద్ధతుల్లో కండోమ్ వాడడం, అంతర ఇంజక్షన్ వేసుకోవడం, ఐయుసిడి( కాపర్ టీ), గర్భ నిరోధక మాత్రలు, పిపిఐయుసిడి, అలాగే శాశ్విత పద్ధతులలో స్త్రీలు ట్యూబెక్టమీ చేయించుకోవడం ఉత్తమ మన్నారు. పురుషులు వ్యాసెక్టమీ చేయించు కోవచ్చని తెలిపారు. అనంతరం వైద్యశాఖ కార్యాలయ సమావేశభవనంలో సమావేశం నిర్వహించి కుటుంబ నియంత్రణ కోసం ఉత్తమ సేవలు అందించిన డాక్టర్స్ కు, ఏయన్ యంలకు, ఆశలకు, సేవలను పొందిన లబ్ధిదారులకు, లాటరీ విధానం ద్వారా ఎన్నిక చేసి క్యాష్ అవార్డ్ మరియు ప్రశంస పత్రములను అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐసిడియస్. పిడి డా.శ్రీదేవి, వైద్యశాఖ ప్రోగ్రాం అధికారులు డా.సుజాత, వైద్యులు యుగంధర్, నారాయణస్వామి, గంగాధర్ రెడ్డి, రవి శంకర్, మలేరియా అధికారి ఓబులు స్టాటిస్టికల్ అధికారి మహమ్మద్ రఫీ, డెమో ఇంచార్జ్ త్యాగరాజు, డిప్యూటీ హెల్త్ ఆఫీసర్ గంగాధర్, డీఎస్ఓ గౌడ్, ఏఎన్ఓ లక్ష్మీనరసమ్మ, హెచ్ఈఓ సత్యనారాయణ, పీఎంఓ నాగన్న, ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ విష్ణు ప్రియ, వెంకటేష్, కిరణ్ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## పేదలకు ఇచ్చే ఇళ్లలో పార్టీలు చూడం

### అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేస్తాం..

### అనంత అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి

**విశాలాంధ్ర-అనంతపురం:** గత ప్రభుత్వంలో అసంపూర్తిగా మిగిలిన ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేసి లబ్ధి దారులకు అందిస్తామని.. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. నగర సమీపంలోని ఆలమూరి లేఔట్‌లో అనంతపురం అర్బన్ లబ్ధిదారుల కోసం నిర్మిస్తున్న ఇళ్లను గురువారం పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట హౌసింగ్, మున్సిపల్, విద్యుత్ శాఖతో పాటు వివిధ శాఖల అధికారులు ఉన్నారు. ఇప్పటి వరకు ఎన్ని ఇళ్లు ప్రారంభించారు.. ఎన్ని పూర్తి చేశారు. లబ్ధిదారులకు ఎన్ని ఇచ్చారు అక్కడ నాణ్యతా ప్రమాణాలు మౌళిక వసతుల కల్పన ఇలాంటి అన్ని అంశాలను తెలుసుకున్నారు. దగ్గుపాటి మీడియాతో మాట్లాడుతూ గతంలో వైసీపీ నాయకులు చెప్పినట్టుగా పరిస్థితి ఇక్కడ లేదన్నారు. ఇది పూర్తిగా కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో నిర్మిస్తున్నారని.. ఇప్పటికే 7వేల ఇళ్ల నిర్మాణం చేపడితే.. 12వందలు మాత్రమే పూర్తయ్యాయన్నారు. మిగిలిన వాటిని నిర్మాణాలు వేగవంతం చేయాలని ఆదేశించినట్టు వివరించారు. ఇప్పటి వరకు నిర్మించిన వాటిలో నాణ్యతాలోపం స్పష్టంగా కనిపిస్తోందని.. కనీసం ఇప్పటి నుంచి చేపట్టే నిర్మాణాలైనా సరిగా చేయాలని చెప్పినట్టు తెలిపారు. నగరంలో కూడా చాలా మంది ఇళ్లు కావాలని అడుగుతున్నారని... ఇక్కడ వెయ్యి వరకు ఉన్నాయని.. త్వరలోనే పార్టీలకతీతం గా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు ఇస్తామని.. ఇందులో టీడీపీ, వైసీపీ అన్న తేడాలు ఉండవన్నారు. అలాగే హౌసింగ్ విభాగంలో జరిగిన అక్రమాలపై త్వరలోనే విచారణకు ఆదేశించి బాధ్యులపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ధరల నియంత్రణే ప్రభుత్వ లక్ష్యం

### కందిపప్పు రూ.160, సన్న బియ్యం రూ.48లకే విక్రయాలు

**విశాలాంధ్ర-అనంతపురం :** ధరల నియంత్రణే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తోందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ప్రస్తుతం నిత్యవసర ధరలు ఆకాశన్నంటుతున్న నేపథ్యంలో... ప్రజలపై ఆ భారాన్ని కొంతైనా తగ్గించాలన్న ఉద్దేశంతో సన్న రకం బియ్యం, కందిబేడలు రైతు బజార్‌లో మార్కెట్ కన్నా తక్కువ ధరకు అందిస్తున్నట్లు వివరించారు. ఎన్టీఆర్ రైతు బజార్‌లో ఈ కేంద్రాన్ని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పౌరసరఫరాల శాఖ అధికారిని శోభ, మున్సిపల్ కమిషనర్ మేఘ స్వరూప్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. కంది బేడలు, బియ్యం నాణ్యతను పరిశీలించారు. అలాగే రైతు బజార్‌లో కూరగాయల విక్రయాలను కూడా ఆయన పరిశీలించారు. వ్యాపారులతో, అలాగే ప్రజలతో మాట్లాడి ధరల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం సంక్షేమ పథకాలే కాకుండా ప్రజలకు నిత్యావసరాల ధరల భారాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో మిల్లర్లతో మాట్లాడి బియ్యం, కంది బేడలు మార్కెట్ ధర కన్నా కిలోపై పది నుంచి 20రూపాయలు తక్కువకు వీటిని అందిస్తున్నట్లు తెలిపారు. కందిపప్పు రూ.160, సన్న బియ్యం రూ.48లకే విక్రయిస్తున్నామని... ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

## ఒకే వ్యక్తిపై తరచుగా దాడి..



**విశాలాంధ్ర-రాయదుర్గం :** రాయదుర్గం నియోజకవర్గం గుమ్మగట్ట మండల పరిధిలోని రంగచ్చేడు గ్రామానికి చెందిన హరిజన తిప్పే స్వామిపై రాయదుర్గం మండల పరిధిలోని కొంతనపల్లి గ్రామానికి చెందిన మైలారి అనే వ్యక్తి అతని బంధువులు తిప్పేస్వామిపై తరచుగా దాడికి పాల్పడుతున్నారు. ఈనెల 2వ తేదీన పట్టణంలో ఉన్న పెట్రోల్ బంక్ వద్ద దాడికి పాలపడ్డారు. బాధితుడు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నాడు. ఆరోజు రాయదుర్గం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు కూడ చేశాడు. పోలీసులు కేసు కూడ నమోదు చేయడం జరిగిందని తెలిపాడు. గురువారం ఉదయం ఎస్ఎల్వి మెడికల్ షాప్ వద్ద ఉన్న తిప్పేస్వామి పై మైలరి అతని బంధువులు నలుగురు కలిసి దాడికి పాల్పడడానికి చూశారు. అక్కడున్న స్థానికులు ఇరువురికి సర్దిచెప్పి పంపి చేశారు. బాధితుడు తిప్పేస్వామి స్వామి స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. బాధితుడు తిప్పేస్వామి తెలిపిన వివరాలు మేరకు పాత కక్షలు మనసులో పెట్టుకొని కుటుంబ సభ్యులతో కలిసి తరచుగా దాడి చేస్తున్నాడని, అతని నుండి నాకు ప్రాణాల హాని ఉంది. పోలీసులు కేసు నమోదు చేసిన కూడ లెక్కచేయకుండా దాడికి పాల్పడుతున్నాడు. పోలీస్ అధికారులు ఇప్పటికైనా మైలరీ అతని కుటుంబ సభ్యులపై గట్టి చర్యలు తీసుకోవాలని కోరుతున్నాడు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 12, జులై 2024


# జిల్లా అభివృద్ధికి అందరి సహకారం ఉండాలి

- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్
- అర్హులైన వారికి సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ

**విశాలాంధ్ర-పుట్టపర్తి:** జిల్లా అభివృద్ధి జరగాలంటే అందరి సమష్టి కృషితోనే సాధ్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితమ్మ సంయుక్తంగా పేర్కొన్నారు. గురువారం పుట్టపర్తిలోని సాయి ఆరామం ఫంక్షన్ హాల్‌లో కలెక్టర్ టీఎస్ చేతన్ అధ్యక్షతన తొలి జిల్లా స్థాయి సమీక్షా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, హిందూపూరం యం.పి.పార్థ సారథి పుట్ట పర్తి శాసన సభ్యులు పల్లె సింధూర, మడకశిర ఎంఎల్ ఏ యం ఎస్ రాజు,జిల్లా ఎస్పి మాధవరెడ్డి, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, జడ్పీ సీఈవో వైఖోమ్ నదియా, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ వివిధశాఖల అధికారులు హాజర య్యారు. వ్యవసాయ శాఖ, జల వనరులు, వ్యవసాయ, ఉద్యాన వన, ఏపీఎంఐపీ, డీఆర్‌డీఏ డి డబ్ల్యూఎంఏ, ఆర్‌డబ్ల్యూఎస్, పబ్లిక్ హెల్త్, వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్, రోడ్లు భవనాల శాఖల, హౌసింగ్, మైనర్ ఇరిగేషన్, హంద్రీనీవా కాలవపనులు, పర్యాటక శాఖ, జిల్లా పరిశ్రమల శాఖ, మార్కెటింగ్ వివిధ శాఖల పనితీరుపై సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర వైద్య శాఖ మంత్రి సత్య కుమార్ మాట్లాడుతూ గత 5 సంవత్సరాల కాలంలో రాష్ట్రంలో అస్తవ్యస్థ పాలన లోపాలు సరిదిద్దుకోవాల్సిన అవసరం, ఉన్నప్పటికీ విజన్, విశేష అనుభవం కలిగిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో జిల్లా పరిస్థితులకు అనుగుణంగా అభివృద్ధి పనులు చురుగ్గా జరగాలని మంత్రి సత్యకుమార్ ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు అందరూ సమన్వయంతో చిత్త శుద్ధితో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఇసుక సమస్య లేకుండా ఉచిత ఇసుక విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, ఈ విధానం పక్కదారి పట్టకుండా అధికారులు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. అధికారుల సహకారం ఉంటే జిల్లా అభివృద్ధి ముందు వరుసలో ఉంటుం దని అందుకు అవసరమైన నిధులు కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి తెప్పించడానికి నా వంతు కృషి చేస్తానని తెలిపారు. ఆసుప్రతుల్ని బలోపేతం చేసేందుకు ఏమేమి చర్యలు తీసుకోవాలో తెలుసుకుంటామని, లోటుపాట్లను సరిదిద్దుతా మని చెప్పారు. మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి వ్యాధుల విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. 48 వేల మందికి క్యాన్సర్ పరీక్షలు నిర్వహిం చడం జరుగుతూ ఉందని తెలిపారు జిల్లాలో పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని, అలాగే పర్యటక రంగం, అభివృద్ధి చెందితే స్థానిక యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. అనంతరం బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి జరిగింది అంటే అది తెలుగు దేశం ప్రభుత్వం ఆధ్వర్యంలోనే జరిగిందని, గత ఐదేళ్లలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. ప్రజలు ఏ నమ్మకంతో అయితే మాకు ఓటేశారో అదే నమ్మకాన్ని ఎన్డీఏ కూటమి నిలబెట్టుకుంటుందని, ఒకపక్క పోలవరం పనులు, మరోపక్క అమరావతి పనులు, రాష్ట్రవ్యాప్తంగా అన్ని శాఖల పరిధిలో అభివృద్ధి పనులు మొదలుపెట్టారన్నారు. మొదటి సంతకం డీఎస్సీ పెట్టారని, జిల్లాలో ఇరిగేషన్, పరిశ్రమలు ఏర్పాటు, హార్టికల్చర్ హబ్ లాంటి అనేక అభివృద్ధి పనులు శ్రీకారం చుడతామన్నారు. మన జిల్లాపై ముఖ్యమం త్రికి ప్రత్యేకమైన ఆసక్తి ఉందని, కరువు జిల్లాకి కృష్ణా జలాలను తీసుకువచ్చిన అపర భగీరధుడు చంద్రబాబు అన్నారు.

## ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలి

**విశాలాంధ్ర-గోరంట్ల:** పుట్టపర్తిలోని ఆర్ ఫంక్షన్ హాల్‌లో

పుట్టపర్తి నియోజక వర్గ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి బీజేపీ జాతీయ కార్యదర్శి సత్య కుమార్ యాదవ్ విచ్చేసి ప్రసంగిం చారు. జిల్లాలో పార్టీని బలోపేతం చేయాలని అందుకు ప్రతి కార్యకర్త ఒక సైనికుడిల్లా పని చేయాలని, నా అండ ఉంటుం దని తెలిపారు, జిల్లా బీజేపీ అధ్యక్షుడు జి యం శేఖర్ మాట్లా డుతూ... ఉదయం కార్యకర్తలను కలిసే అవకాశం గురించి అడగగా మంత్రి అధికారిక సమావేశం ఒక అరగంట ముందు గా ముగించి కార్యకర్తలను కలవటానికి సమయం ఇచ్చినం దుకు మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమం లో బిజెపి జిల్లా ఇంచార్జ్ బాలకృష్ణ, అనంతపురం జిల్లా అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాసులు, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు వంశీ కృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేష్ రెడ్డి, తలపుల గంగాధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజా రెడ్డి, హరి పాల్గొన్నారు.

# సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్న మంత్రులు

**విశాలాంధ్ర-పుట్టపర్తి :** రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. గురువారం జిల్లా స్థాయి అభివృద్ధి మండలి సమావేశానికి విచ్చేసిన మంత్రులు ప్రశాంతి నిలయానికి చేరుకోన్నారు. మంత్రులతో పాటు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పాల్గొన్నారు. వారికి సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్ జె రత్నాకర్ ట్రస్ట్ సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం సాయి మహాసమాధిని దర్శించుకొన్నారు. స్వాగతం పలికిన వారిలో స్థానిక నాయకులు టిడిపి పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, మైనార్టీ రాష్ట్ర నాయకుడు మహమ్మద్ రఫీ, జిల్లా టిడిపి కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మాజీ మున్సిపల్ చైర్మన్లు బెస్త చలపతి, పిసి గంగన్న, తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర మంత్రులు జిల్లా స్థాయి అభివృద్ధి మండలి సమావేశం జరగనున్న సాయి ఆరామం అతిథి గృహానికి చేరుకున్నారు. అక్కడ కలెక్టర్ టిఎస్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఎస్పీ మాధవరెడ్డి, జిల్లా అధికారులు మంత్రులకు పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు.

# ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం

**విశాలాంధ్ర-ధర్మవరం :** పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రపంచ జనాభా దినోత్సవం వేడుకలను జరుపుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెంట్ మాధవి, పిపి యూనిట్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ సురేష్ నాయక్ , డాక్టర్ శ్రావణి ఆధ్వర్యంలో పట్టణంలోని పలు కూడలిలో ర్యాలీగా వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. డాక్టర్ మాధవితో పాటు మెడికల్ ఆఫీసర్లు మాట్లాడుతూ ప్రపంచ జనాభా వలన కలుగు నష్టాలు, లాభాలను తెలియజేయ దానికే ర్యాలీలో అవగాహన కల్పించడం జరిగిందన్నారు. జనాభాను నియంత్రణలో భాగంగానే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వారు తెలిపారు. ముఖ్యంగా కాన్పుకు కాన్పుకు మధ్య ఎడమ పాటించవలెనని, బాల్య వివాహాలను నియంత్రించడం (ఫ్యామిలీ ప్లానింగ్) కుటుంబ నియంత్రణ పాటించడం పిల్లలు పుట్టకుండా తాత్కాలిక పద్ధతులు పాటించడంలో అంతర ఇంజక్షన్, కండోమన్స్ వాడడం, తదితర పద్ధతులు పాటించాలని తెలిపారు. శాశ్వత పద్ధతిలో మహిళలకు విక్టరీ పురుషులకు వికట్టమి పాటించడం వల్ల చిన్న కుటుంబం చింతలేని కుటుంబం అవుతుందని తెలిపారు. దేశ సమగ్రతను కాపాడుకోవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్మనమల పీహెచ్సీ డాక్టర్ పుష్పలత, గైనకాలజిస్ట్ డాక్టర్..శైలజ, యూపీహెచ్సి డాక్టర్ శ్వేత, డాక్టర్ ప్రియాం, అర్బన్ ఏఎన్ఎంలు,ఆశా కార్యకర్తలు, సూపర్వైజర్లు అన్న లక్ష్మీనారాయణ, జ్యోతి, సునీత తదితరులు పాల్గొన్నారు.

## బాలల లైంగిక వేధింపుపై అవగాహన సదస్సు

**విశాలాంధ్ర-గుడిబండ :** మందలహల్లి జిల్లా పరిషద్ ఉన్నత పాఠశాలలో ఆర్.డి.టి,మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు అరికడ దాం, ఆడబిడ్డలను కాపాడుదాం అనే కార్యక్రమం ఆర్డిటి టీం లీడర్ ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా అమ్మాయిలకు లఘుచిత్రాల ద్వారా ప్రస్తుత సమాజంలో ఎదురైయ్యే సమస్యల్ని ఎలా ఎదుర్కోవాలి బాల్య వివాహాలు, లైంగిక వేధింపులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గుడిబండ ప్రాజెక్ట్ మహిళా శిశు అభివృద్ధి పథక అధికారిని పద్మావతి, తహసిల్దార్ ప్రతాప్ రెడ్డి, గుడిబండ ప్రాజెక్ట్ మహిళా శిశు సంక్షేమ అభివృద్ధి పథకం అధికారిణి పద్మావతిలు మాట్లాడుతూ చిన్న వయసులో వివాహాలు చేయడం వల్ల అమ్మాయిలు మానసిక, శారీరక ఒత్తిడికి గురి కావడం అలాగే ప్రసవ సమయంలో తల్లి బిడ్డ ప్రాణాలు కోల్పోతా రని తెలిపారు. ఆడ పిల్లలకు 18 సంవత్సరాలు మగ పిల్లలకు 21 సంవత్సరాలు నిండాలన్నారు.

# పోగొట్టుకున్న టీచర్ బ్యాగు అప్పగింత

**విశాలాంధ్ర-ధర్మవరం:** పట్టణంలోని కొత్తపేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో టీచర్‌గా పని చేస్తున్న అశ్విని తన బ్యాగు పోగొట్టుకు పోవడంతో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు అందుకున్న వన్టౌన్ కాని స్టేబులు మారుతి, దివాకర్ విచారణ చేపట్టారు. ఫిర్యాదు అందిన వెంటనే కుమారుడు యశోద స్కూల్లో రెండవ తరగతి చదువుతున్న సందర్భంగా, పిలుచుకొని రావడానికి వెళ్లగా తదుపరి బ్యాగు కనపడలేదు. యశోద స్కూల్‌కు చేరుకున్న మారుతి దివాకర్‌లు టీచర్ ఫోన్ నెంబర్ తెలుసుకొని ఫోన్ చేయుగా, ఒక ఆటో వ్యక్తి వద్ద ఉన్నట్లు, అక్కడ ఉన్న వ్యక్తులు చెప్పారు. అప్పటికప్పుడే ఆటో వద్ద చేరుకొని విచారించగా, ఆటో వ్యక్తి కూడా ఎవరో పోగొట్టుకున్నారు ఇవ్వాలని అనుకున్నానని తెలిపాడు. దీంతో పోలీసులు ఆ బ్యాగుని తీసుకొని పోలీస్ స్టేషన్లో అశ్విని టీచర్కు అప్పగించారు. బ్యాగులో ఏటీఎం కార్డుతో పాటు ఒక సెల్ ఫోన్ కలదు అని తెలిపారు. అశ్విని మారుతీకు,దివాకర్ కు కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఘనంగా ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం

**విశాలాంధ్ర-ధర్మవరం:** పట్టణంలోని ధర్మారం ఆర్టీసీ డిపో కార్యాలయ ఆవరణ ముందు 73వ ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు డిపో కార్యదర్శి ముస్తఫా అధ్యక్షతన ఘనంగా నిర్వహించుకున్నారు. అనంతరం డిపో సీనియర్ నాయకులు టిఐ-3 కే శ్రీరాములు,శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు కేవి. నాగార్జున రెడ్డి హాజరై కేక్ కట్ చేసి ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు యూనియన్ గొప్పతనాన్ని చాటిచెప్పారు. ఆనాటి నుండి నేటి వరకు ఆర్టీసీ కార్మికులు ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాడి ఎన్నో సమస్యలకు పరిష్కారం యూనియన్ ద్వారా చూపబడింది అని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల హక్కుల కోసం యూనియన్ అన్నివేళలా పోరాడుతుందని తెలిపారు. తదుపరి అందరికీ మిఠాయిలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రీజినల్ సహకార దర్శి బి. నర్సింహులు, రీజనల్ నాయకులు ఆదినారాయణ, దూలప్ప, గ్యారేజీ కార్యదర్శి మల్లికార్జున, టి ఐ-3 పెద్దక్క, ఏడీసీ నరసిం హులు, సిస్టం సూపర్వైజర్ సుధాకర్ పాల్గొన్నారు.

# ధర్మవరం డిగ్రీ కళాశాల అడ్మిషన్ల గడువు పెంపు

**విశాలాంధ్ర-ధర్మవరం:** పట్టణంలోని ప్రభుత్వ కే హెచ్ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల గడువు సమయం పొడిగించామని కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ డిగ్రీ కళాశాలలో చేరునటువంటి విద్యార్థినీ విద్యార్థులకు ఆన్లైన్ రిజిస్ట్రేషన్ గడువు ఈనెల 20వ తేదీ వరకు వరకు పొడగించడం జరిగింది అన్నారు. వెబ్ ఆప్షన్ ఇచ్చు కోవడం కోసం ఈనెల 23 నుండి 26వ తేదీ వరకు ఖరారు చేశామన్నారు. 31వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుంది అన్నారు. కే.హెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్ పాస్ అయిన విద్యార్థులను దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. ఉత్తమ విద్యా బోధనతో పాటు వివిధ రకాలైన పోటీ పరీక్షలకు కూడా సంసిద్ధం చేయడం జరుగుతుందన్నారు. ఆధునిక కంప్యూటర్ ల్యాబ్, అత్యాధునిక సౌకర్యాలతో కూడిన జిమ్, విశాలమైన క్రీడా మైదానం, విద్యార్థులకు వసతిగృహం (హాస్టల్) సదుపాయం, ఆర్టీసీ బస్సు సౌకర్యం కలదు అని తెలిపారు. సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కళాశాలలో చేరి తమ భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవాలని తెలిపారు.

# జనసేన పార్టీ కార్యకర్త మృతి పట్ల సంతాపం.. ఆర్థిక సహాయం

**విశాలాంధ్ర-ధర్మవరం:** ధర్మవరం మండలం పరిధిలోని రావులచెరువు గ్రామానికి చెందిన జనసేన పార్టీ కార్యకర్త మారుతి ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. సమాచారం అందుకున్న జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి నా కుటుంబానికి సంతాపాన్ని తెలియజేస్తూ మృతుని భార్య అశ్వినికి జనసేన పార్టీ తరఫున పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. పార్టీ కార్యకర్త మరణం బాధాకరమని తప్పకుండా మీ కుటుంబానికి జనసేన పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని కుటుంబానికి భరోసా ఇచ్చి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఇతరులకు సేవ చేయడంలోనే ఎంతో సంతృప్తి

**విశాలాంధ్ర-ధర్మవరం:** ఇతరులకు సేవ చేయడంలోనే ఎంతో సంతోషం సంతృప్తి లభిస్తుందని శ్రీ సత్య సాయి భజన మండలి (పాత మందిరం) కన్వీనర్ లు తెలిపారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఉదయం 250 మంది రోగులకు సహాయకులకు పాలు, బ్రెడ్లు, బిస్కెట్లను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పుట్టపర్తి సాయిబాబా ఆశీస్సులతో, దాతల సహాయ సహకారాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. నాటి సేవాదాతగా అనంతపురం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెంకటేష్ భార్య వెంకటరత్న వారి సహకారంతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు. అనంతరం దాతకు కృతజ్ఞతలను తెలియజేశారు. తదుపరి ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెంట్ మాధవి మాట్లాడుతూ శ్రీ సత్య సాయి భజన మండలి వారు చేస్తున్న సేవా కార్యక్రమాలు రోగులకు వరంలాగా మారాయని, సుదీర గ్రామాల నుండి వచ్చువరకు ఉదయం పాలు, బ్రెడ్లు, బిస్కెట్లు ఇవ్వడం సంతోషించదగ్గ విషయమని తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి తరఫున శ్రీ సత్య సాయి భజన మండలి వారికి సూపరింటెంట్ మాధవి కృతజ్ఞతలను తెలియజేశారు.

# కలెక్టర్‌ను కలిసిన జిల్లా టిడిపి అధ్యక్షుడు

**విశాలాంధ్ర - హిందూపురం :** జిల్లా నూతన కలెక్టర్‌ను పుట్టపర్తిలో గురువారం, జిల్లా మంత్రి సవితమ్మ, ఎంపీ బి కే. పార్థసారథి, మడకశిర ఎమ్మెల్యే ఎం ఎస్. రాజు, పుట్టపర్తి శాసనసభ్యులు పల్లె సింధూర రెడ్డితో కలిసి, టీడీపీ జిల్లా అధ్యక్షులు వడ్డే. కొల్లకుంట్ల అంజినప్ప నూతన కలెక్టర్‌కు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

# చిత్రావతిలో డ్రైనేజీ నీటిని వదలకుండా చర్యలు తీసుకోండి

## ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

**విశాలాంధ్ర-పుట్టపర్తి:** పుట్టపర్తి వద్ద చిత్రావతి నదిలో డ్రైనేజీ నీటిని వదులుతున్నారని, డ్రైనేజీ నీటిని చిత్రావతిలో వదలకుండా చర్యలు తీసుకోవాలని పుట్టపర్తి శాసనసభ్యులు పల్లె సింధూర రెడ్డి ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింధూర రెడ్డి మాట్లాడుతూ పుట్టపర్తి ఆధ్యాత్మిక కేంద్రమని అనేకమంది విదేశీయులు వస్తుంటారని, డ్రైనేజీని డైవర్ట్ చేయాలన్నారు. ఈ విషయమై అధికారులతో కలిసి పరిశీలించాలన్నారు. ఆర్డబ్ల్యూఎస్ కింద చేపట్టిన పనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని నిధులు ఇచ్చారు అనేది తెలియజేయాలన్నారు. పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే నాలుగేళ్ల పాటు తన పొలానికి నీరు అందించుకున్నారని, మిగిలిన వారికి నీరు అందలేదని, ఆ ప్రాజెక్టు ఎందుకు అలా జరిగింది అనేది పరిశీలించాలన్నారు. కప్పల బండ, వివిధ పారిశ్రామిక నగరాలు ఎప్పటిలోపల పూర్తి చేస్తారో, సమావేశంలో చర్చించారు.

# మాంగల్య షాపింగ్ మాల్ తొలగించే వరకు మా పోరాటాలు ఆగవు..

**విశాలాంధ్ర-ధర్మవరం :** ధర్మవరంలో మాంగల్య షాపింగ్‌మాల్ తొలగించే వరకు మా పోరాటు ఆపమని పట్టణ వస్త్ర వ్యాపారుల సంఘం తెగేసి చెప్పింది. గురువారం తొలుత పట్టణంలో ర్యాలీ నిర్వహించి, మాంగల్య షాపింగ్ మాల్‌ను తొలగించాలన్న నినాదాన్ని హెూరెత్తించారు. అనంతరం పట్టణానికి వచ్చిన ఆరోగ్య శాఖ మంత్రికి తమ గోడును విన్నవించారు. ఈ సందర్భంగా వస్త్ర వ్యాపారులు మాట్లాడుతూ"మన ఊరు-మన దుకాణం"అనే నినాదంతో కమిటీ ఏర్పాటు చేసుకోవడం జరిగిందని మాలో చాలామంది ఉన్నత విద్యను చదివి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక చిన్నచిన్న దుకాణాలు పెట్టుకుని జీవనాన్ని సాగిస్తున్నారని తెలిపారు. గత ఏడాదికాలంగా ఆర్థిక సమస్యల కారణంగా కుటుంబ పోషణ చేసుకొనలేక నెలసరి బాడుగలు కట్టలేక దుకాణంలో సిబ్బందికి జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. దీనికంతటికి కారణం కొన్ని నెలల కిందట మాంగల్య షాపింగ్ మాల్ను ప్రారంభించడమే కారణమని వారు వాపోయారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారు ఇక్కడ వ్యాపారం చేస్తున్నందువల్లనే స్థానికంగా ఉండే వ్యాపారస్తులు పూర్తిగా దెబ్బతిని, జీవనోపాధికి ఎంతో ఆటంకం కలుగుతోందని బాధను వ్యక్తం చేశారు.కరోనా లాంటి కష్ట సమయంలో కూడా తాము ఆత్మస్థైర్యం కోల్పోకుండా మంచి రోజులు వస్తాయి కదా అని మేము ఎదురు చూడగా నేడు మాంగల్య షాపింగ్ మాల్ రావడంతో మరింత దెబ్బతినడం జరిగిందని తెలిపారు. మాంగల్య షాపింగ్ మాల్లు వారు నాణ్యతలేని వస్త్రాలను దళారీల ద్వారా లాటుగా కొనుగోలు చేసి విపరీతమైన ఆఫర్లు పెట్టి మా బ్రతుకులను రోడ్డుమీద నిలబెట్టారని, పరిస్థితి ఇంకా కొంతకాలం కొనసాగితే రైతు సోదరులు చేనేత కార్మిక సోదరులు మాదిరిగా తాము కూడా ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. ఈ కుటీర పరిశ్రమ ద్వారా సుమారు 6000 మంది ఆధారపడి జీవిస్తున్నామని, మానవతా దృక్పథంతో మమ్ములను ఆదుకోవాలని కోరారు. స్పందించిన మంత్రి సత్య కుమార్ యాదవ్ ముఖ్యమంత్రితో తాను చర్చించి న్యాయం జరిగేలా చూస్తానని తెలిపారు.

# టెండర్‌పై అవగాహన సమావేశం..

**విశాలాంధ్ర-ధర్మవరం:** నియోజకవర్గ పరిధిలోని బత్తలపల్లి బస్ స్టేషన్ ఖాళీగా ఉన్నందున, ఆ బస్ స్టేషన్ వ్యాపారస్తుల కొరకు ఉపయోగపడే విధానంపై అవగాహన సదస్సులు ఈనెల 12వ తేదీన ధర్మవరం డిపో మేనేజర్ కార్యాలయం నందు అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ సత్యనారాయణ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ బత్తలపల్లి లోని ఆర్టీసీ బస్ స్టేషన్ 15 సంవత్సరాలు టెండర్ ద్వారా బాడుగకు ఇవ్వడానికి ఆర్టిసి శ్రీకారం చుట్టిందన్నారు. ఔత్సాహికులైన వ్యాపారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ఈనెల 16వ తేదీన పూర్తి చేసిన టెండర్ ఫారంను ఈనెల 18వ తేదీ ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటలలోపు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కడప వారి కార్యాలయం నందు ఉంచిన టెండర్ బాక్సులో వేయాలని తెలిపారు

# సరసమైన ధరలకు నాణ్యమైన సరుకులు : మంత్రి సవితమ్మ

**విశాలాంధ్ర-పెనుకొండ :** కిరాణా మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెనుకొండలోని మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం ఎదుట వాణిజ్య భవనంలో గురువారం ఏర్పాటు చేసిన నిత్యావసర వస్తువుల సబ్సిడీ కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి సవితమ్మ సందర్భాన్ని పురస్కరించు కొని మంత్రి మాట్లాడుతూ నిత్యవసర వస్తువులు ధరలు పెరగడంతో రాష్ట్ర ప్రభుత్వము సబ్సిడీపై బియ్యం కందిపప్పును మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు ఇవ్వడానికి వ్యాపారస్తులతో మాట్లాడి సబ్సిడీ కేంద్రాన్ని ప్రారంభించామని ప్రజల సద్వినియోగం చేసుకోవాలని మంత్రి తెలిపారు. సరసమైన ధరలకు నాణ్యమైన సరుకులు అందించా లని ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సత్యసాయి జిల్లా వ్యాప్తంగా 4 కేంద్రాలను ప్రారంభించామని రైతు బజార్‌ల ద్వారా పేద ప్రజలకు మార్కెట్ ధరల కంటే తక్కువ ధరలకే నిత్యవసర సరుకులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, తహసిల్దార్ ఉదయ శంకర్ రాజు, సిఎస్డిటి ప్రభావతి, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# భజన బృందానికి సంగీత పరికరాలు వితరణ..

**విశాలాంధ్ర-పెనుకొండ :** రొద్దం మండలం రాగి మేకలపల్లి గ్రామానికి చెందిన భజన బృందానికి పుట్టపర్తికి చెందిన సత్య సాయి భక్తులు సంగీత పరికరాలను బహుకరించారు. టూరిజం విభాగపు పరిపాలన అధికారి రమేష్ రెడ్డి పోస్టల్ సిబ్బంది అల్లా ప్రకాష్ భజన బృందానికి కావాల్సిన తాళాలు కంజీరాలు దప్పుల్ని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆంగ్ల మరియు జర్నలిజం విభాగపు సహకారంతో కళాశాల ప్రిన్సిపల్ కేశవరావ్ చేతుల మీదుగా బహుకరించారు. గ్రామంలో ఆధ్యాత్మిక భావాన్ని నెలకొల్పి శాంతియుత జీవనానికి కృషి సల్పాలని గ్రామస్తులకు ప్రిన్సిపల్ సూచించారు. సంగీత పరికరాలను బహుకరించిన దాతలకు సహకరించిన ప్రిన్సిపాల్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ సత్యసాయి తాలూకా సమితి కన్వీనర్ శంకర్, అధ్యాపకులు రామన్న, రంగనాయకులు, రాగి మేకల పల్లి గ్రామస్తులు నాగరాజు సుధప్ప నరసింహులు పాల్గొన్నారు.

# త్రిబుల్ ఐటీలో సీటు సాధించిన ఎస్ఎస్ వైవీన్ విద్యార్థులు,..

**విశాలాంధ్ర-చిలమత్తూరు రూరల్:** మండల కేంద్రంలో గల ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఎస్ఎస్ వైవిన్ విద్యార్థులు త్రిబుల్ ఐటీ ఇడుపులపాయ కళాశాల లో సీటు సాధించారు. గత సంవత్సరం పదవ తరగతి లో పాఠశాలలో మొదటి ర్యాంకు సాధించిన దిగువపల్లి తండాకు చెందిన గౌతం నాయక్, చిలముత్తూర్ మండల కేంద్రానికి చెందిన ఏ ధనుష్ నాలుగవ ర్యాంకు సాధించిన విద్యార్థులు త్రిబుల్ ఐటీ లో సీటు సాధించడంతో తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు. పాఠశాల యాజమాన్యం వేసవి సెలవుల్లో ఉచితంగా ఇచ్చిన శిక్షణ ఎంతో ఉపయోగపడిందని కొనియాడారు.

## త్రిబుల్ ఐటీకి పెనుకొండ విద్యార్థిని ఎంపిక

**విశాలాంధ్ర-పెనుకొండ :** పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని శ్రీరాములయ్య కాలనీలో నివాసి గంగాధర్ నాయక్ కూతురు దివ్య బాయి గురువారం వెలువడిన ఫలితాల్లో త్రిబుల్ ఐటీకి ఎంపికైంది. అమ్మాయి అప్లికేషన్ నెంబర్ 24036239. అమ్మాయి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నందు 10వ తరగతిలో 600 మార్కులకు గాను 562 మార్కులు సాధించి పాఠశాలల్లో అత్యధిక మార్కుల సాధించిన విద్యార్థినిగా ఎంపికైందని, ఈనెల 22 23వ తేదీలలో ఇడుపుల పాయ నందు సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ అడ్మిషన్లు నిర్వహించబడునని విశ్వవిద్యాలయం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈమె తల్లిదండ్రులు కూలి పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. తమ కూతురు త్రిబుల్ ఐటీ లో సీటు సాధించడం ఆనందంగా ఉందని తల్లిదండ్రులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# మంత్రులకు ఘన స్వాగతం పలికిన టీడీపీ నాయకులు ..

**విశాలాంధ్ర-కొత్తచెరువు:** పుట్టపర్తిలో కలెక్టర్ అధ్యక్షతన అధికారులతో జరిగే సమీక్ష సమావేశానికి రాష్ట్ర మంత్రులు సవిత ,సత్య కుమార్ యాదవ్, లు గురువారం కొత్తచెరువుకు విచ్చేయడంతో వారికి టిడిపి నాయకులు బిజెపి, జనసేన నాయకులు, కార్యకర్తలు కురుబ సంఘం నాయకులు వారికి ఘనస్వాగతం పలికారు. ముందుగా బాణ సంచారాలు పేల్చి డబ్బులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున మొట్టమొదటిసారిగా సత్యసాయి జిల్లా అధికారులతో జిల్లా అభివృద్ధిపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించడానికి అన్ని విధాల జిల్లాఅభివృద్ధి పరచడానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి కనకదాసు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు హరినాథ్ చౌదరి, శివప్రసాద్, జిల్లా కురుబ సంఘం అధ్యక్షుడు మల్లికార్జున, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, టిడిపి నాయకులు రమేష్, అంగడి ప్రభాకర్, చెన్నప్ప, బిజెప, జనసేన నాయకులు, పాల్గొన్నారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, శుక్రవారం 12, జులై 2024

# నాణ్యత గల నిత్యావసర వస్తువులను పంపిణీ చేయడమే లక్ష్యం...

## ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్‌యాదవ్

**విశాలాంధ్ర-ధర్మవరం :** రాష్ట్రంలోని పేద ప్రజలకు నాణ్యత గల వస్తువులను అతి తక్కువ ధరతో పంపిణీ చేయడమే ప్రభుత్వ లక్ష్యం అని ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని మెయిన్ బజార్లో గల కిరాణా మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు వినియోగదారుల వ్యవహారములు ఆహార పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో సరసమైన ధరలలో నాణ్యమైన సరుకుల అమ్మకం అనే కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. అనంతరం అక్కడ ఉన్నటువంటి కంది బ్యాళ్లు,, బియ్యము నాణ్యతను ఆర్డిఓ వెంకట శివరామిరెడ్డితో పాటు మంత్రి కూడా పరిశీలించారు. ప్రజలందరికీ అతి తక్కువ ధరలో ఉన్న ఈ నిత్యావసర వస్తువులను పంపిణీ చేయాలని అసోసియేషన్ వారికి సూచించారు. అనంతరం సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ పేదలకు ఎన్డీఏ ప్రభుత్వం అండగా ఉంటుందని, సామాజిక భద్రత లో అందరికీ వివిధ రకాలుగా పెన్షన్లను కూడా ఒకేరోజు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ప్రతినెల 1వ తేదీనే పెన్షన్ల దారుల ఇళ్ల వద్దకే వెళ్లి పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ ప్రభుత్వము యొక్క ప్రజా సంక్షేమం పట్ల ప్రజలు కూడా అర్థం చేసుకున్నారని తెలిపారు. ప్రజాహిత కార్యక్రమంలో భాగంగానే బియ్యమును కందిబేలును తక్కువ ధరకు ప్రజలకు అందించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి పౌరసరఫరాల శాఖ మంత్రి కి సత్య కుమార్ యాదవ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

కిరాణా మర్చంట్ వారు పేద ప్రజలకు తక్కువ ధరలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం అనేది గర్వించదగ్గ విషయమని తెలుపుతూ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా ఇసుకను కూడా ఉచితంగా పంపిణీ చేస్తున్నామని కేవలం రవాణా ఖర్చు మాత్రమే ఇల్లు కట్టుకునే వారికి పడుతుందన్నారు. భవన నిర్మాణ కార్మిక కార్మికులకు కూడా ఉపాధి కల్పించడం జరిగిందన్నారు. గత ఐదు సంవత్సరాలలో ప్రభుత్వంలో ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైందని, బెదిరింపులు ,అక్రమ ఆర్జన, ప్రజా ధనమంతా వృధా కావడం జరిగిందన్నారు.. ఈ ఐదు సంవత్సరాలలో మరింత ప్రజలకు అండగా ఉంటూ అభివృద్ధి బాటలో ఎన్డీఏ ప్రభుత్వం ఉంటుందని తెలిపారు. కందిపప్పును కేజీ 160 రూపాయలకు, బియ్యం కేజీ 49 రూపాయలకు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ తో పాటు ఎమ్మార్వో- రమేష్,సిఎస్ డి టి లక్ష్మీదేవి, నాయకులు డోలా రాజారెడ్డి, ఓబులేసు కోటి సూర్య బాబు, జిగ్గా చంద్రశేఖర్, అధిక సంఖ్యలో బిజెపి నాయకులు, అసోసియేషన్ నాయకులు బాలు, రాము, రాజా, వాసు శేషు, చందు తేజ , మల్లీ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ జనాభా దినోత్సవంపై ర్యాలీ

**విశాలాంధ్ర-ఉరవకొండ:** వజ్రకరూరు మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు గురువారం ప్రపంచ జనాభా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్దార్ వలి మాట్లాడుతూ... ప్రతి ఏటా జులై 11న ప్రపంచ జనాభా దినోత్సవాన్ని జరుపుకుంటారని ఇది ప్రపంచ జనాభాలో పెరుగుతున్న సవాళ్లు, ప్రభావాలపై అవగాహన పెంచడానికి ఉద్దేశించిన ప్రపంచ కార్యక్రమం అన్నారు. మానవుల పెరుగుతున్న జనాభా చాలా ఆందోళన కలిగించే విషయంగా పేర్కొనబడిందని అందుకే ప్రపంచ జనాభాకు సంబంధించిన సామాజిక, ఆర్థిక, పర్యావరణ పరిణామాల వంటి ప్రబలమైన సమస్యలను విశ్లేషించడానికి ప్రపంచ జనాభా దినోత్సవాన్ని జరుపుకుంటారని తెలిపారు. పునరుత్పత్తి, ఆరోగ్యం, కుటుంబ నియంత్రణ, లింగ సమానత్వం, స్థిరమైన అభివృద్ధి వంటి జనాభా-సంబంధిత ఆందోళనలను పరిష్కరించడం ప్రాముఖ్యతను నొక్కి చెప్పడానికి ఈ ముఖ్యమైన దినోత్సవం ఐక్యరాజ్యసమితిచే స్థాపించబడిందని పేర్కొన్నారు. జనాభా డైనమిక్స్ అందించే సవాళ్లు, అవకాశాలను గుర్తించడం ద్వారా, ప్రపంచ జనాభా దినోత్సవం ప్రభుత్వాలు, సంస్థలు, వ్యక్తులు చర్చల్లో పాల్గొనడానికి, చర్య తీసుకోవడానికి ఒక వేదికగా ఉపయోగపడుతుందని డాక్టర్ తెలిపారు. ఏళ్లుగా ప్రపంచ జనాభా దినోత్సవం అవగాహన పెంచడంలో, పునరుత్పత్తి హక్కుల కోసం వాదించడంలో, స్థిరమైన అభివృద్ధికి, వ్యక్తులందరి శ్రేయస్సుకు తోడ్పడే విధానాలు, కార్యక్రమాలను ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషించిందని అన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి గురు ప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ సత్యనారాయణ, సూపర్వైజర్ నాగ శంకర్, ఎం ఎల్ హెచ్ పి లు సుదమాధురి,నిర్మల, మణి,,ఏఎన్ఎం సుకన్య, జ్యోతి, వరలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బొమ్మనహల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

## వాల్మీకి వాసంతి హత్యకు కారకులైన దుర్మార్గులను కఠినంగా శిక్షించాలి...

**విశాలాంధ్ర-అనంతపురం:** నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం ఎల్లాల (ముచ్చుమర్రి) గ్రామానికి చెందిన వాల్మీకి వాసంతి అనే చిన్నారిని అత్యాచారం చేసి హత్య చేసిన మైనర్ బాలురను కఠినంగా శిక్షించాలని అలాగే వాసంతి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని అనంతపురం వాల్మీకి ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. అనంతపురం రుద్రంపేట బైపాస్, దగ్గర ఉన్న వాల్మీకి కళ్యాణ మండపంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సభ్యసమాజం తలదించుకునే విధంగా ఆడుకోవడానికి వెళ్లిన తొమ్మిదేళ్ళ వాల్మీకి వాసంతిని హత్యచేసి కాలువలో పడేయడం అత్యంత హేయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలని కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బండమీద గంగాధర్, ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి కోశాధికారి కిషోర్, ఉపాధ్యక్షులు సుధాకర్, కృష్ణమూర్తి, సీనియర్ నాయకులు అంకె నరహరి, రమణ, శ్రీధర్, ఓబులేసు, సూర్యనారాయణ, గోవిందు,ల్యాబ్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ నియంత్రణకు తాత్కాలిక పద్ధతులు అనుసరించాలి..

**విశాలాంధ్ర-రాప్తాడు:** కుటుంబ నియంత్రణకు తాత్కాలిక పద్ధతులు అనుసరించాలని డాక్టర్ శివకృష్ణ, శ్రావణి సూచించారు. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా రాప్తాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి గ్రామవీధుల్లో సీహెచ్ఓ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సీహెచ్ఓ మాట్లాడుతూ జనాభాను తగ్గించడంలో సంభోగం చేసేటప్పుడు కండోమ్ వాడాలన్నారు. అంతర ఇంజెక్షన్, కాపర్ టీ, గర్భనిరధక మాత్రలు(ఛాయా ) ప్రసవానంతర ఐయూసీడీ, అత్యవసర గర్భనిరోధక మాత్రలు వాడాలన్నారు. గర్భ నిరోధక మాత్రలు( మాల-ఎఎన్), శాశ్వత పద్ధతులు ట్యూబెక్టమి, వ్యాసక్టమి గురించి వివరించారు. యువతీ యువకులకు నిర్దేశిత వయసులో వివాహం చేయాలన్నారు. లేత వయసులో వివాహాలు జరుగుట వలన కాన్పు కష్టం కావటం, ప్రసూతి, శిశు మరణాలు సంభవిస్తాయన్నారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ శ్రీధర్ బాబు, ఫార్మసిస్ట్ మూర్తి, ఎం.ఎల్ హెచ్పి లు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులు బంగారు బాటలు వేసుకోవాలి..

### ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మమత

**విశాలాంధ్ర-ఉరవకొండ:** విద్యార్థులు తమ కెరీర్ కు సంబంధించిన విషయాలు తెలుసుకుని వారి ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని ఉరవకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మమత అన్నారు. గురువారం స్థానిక కళాశాల లో భవిష్యత్ సొసైటీ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశం లో ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఇష్టపడి చదివి క్రమశిక్షణతో ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. భవిష్యత్ సంస్థ ప్రతినిధులు శ్రీ బయప రెడ్డి మరియు రామాంజనేయులు విద్యార్థులకు వారి గ్రూప్ కు సంబంధించి ఇంటర్ పూర్తి అయిన తరువాత వారు ఏ ఎ కోర్స్ లో చేరవచ్చు మరియు వాటిని అందిస్తున్న యూనివర్సిటీలు వాటితో లభించే ఉద్యోగఅవకాశాలు మొదలగు అనేక విషయాలు పవర్ పాయింట్ ద్వారా విపులముగా విద్యార్థులకు తెలియజేశారు. బాల, బాలికలకు వేరువేరుగా ఏర్పాటుచేసిన ఈ సమావేశంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ శివ ప్రసాద్, ఖాదర్ ,జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసు, పద్మావతి, అరుణ, సీనియర్ అధ్యాపకులు ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెక్కాల్ చెరువు వేలం రూ 1,73,100

**విశాలాంధ్ర-చిలమత్తూరు రూరల్:** స్థానిక సచివాలయంలో గురువారం సర్పంచ్ సంధ్య, ఈఓఆర్డి ఈశ్వరయ్య, కార్యదర్శి రామ్లు నాయక్ ఆధ్వర్యంలో పెక్కాల చెరువు చేపలు పెంపకానికి వేలం పాట రూ 1,73,100 ఉప్పర అశ్వత్తప్ప పాడినారు. ఈ నేపథ్యంలో వేలం పాటలో పలువురు పోటీ పడగా చివరికి ఉప్పర అశ్వత్థప్ప 1,73, 100 కు దక్కించుకున్నారు. ఇతనికి దాదాపు 12 నెలలు చేపల పెంపకం చేపట్టుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు చేపల పెంపకం దారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ హైస్కూల్లో చదివి త్రిబుల్ ఐటీకి ఎంపిక...

**విశాలాంధ్ర-శింగనమల:** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివిన ఇద్దరు విద్యార్థినిలు పి.సుదీక్ష రెడ్డి, కే అంజూమ్‌లు ట్రిపుల్ ఐటి కి ఎంపిక అయ్యారు. నూజివీడు ట్రిపుల్ ఐటికి పి.సుదీక్ష రెడ్డి, కె. అంజూమ్ ఇడుపులపాయ ట్రిపుల్ ఐటికి ఎంపిక అయ్యారని పాఠశాల హెచ్ఎం సుజాతమ్మ తెలిపారు. వారి ఎంపిక కావడం పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థినుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

## గురుకుల పాఠశాలలో సీట్లు పెంచాలి ఏపీ సెక్రటరీకి ఏఐఎస్ఎఫ్ వినతి

**విశాలాంధ్ర-జేఎన్టీయూఏ:** అనంతపురం జిల్లాలో గురుకుల పాఠశాలలో సీట్లను పెంచాలని బీసీ గురుకుల రాష్ట్ర సెక్రెటరీ కృష్ణమోహనకు గురువారం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి. జాన్సన్ బాబు, ఉపాధ్యక్షుడు కుళాయి స్వామి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిత్య కరువు కాటకాలతో అల్లాడుతున్న నిరుపేదలు చదువుతూనే ఉజ్వల భవిత ఉంటుందనే.. ఆశయంతో పక్క రాష్ట్రాలకు వెళ్లే పరిస్థితి నెలకొన్నది. అనంతపురం జిల్లాలోని 800 సీట్లు మాత్రమే ఉండడంతో విద్యార్థులు తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం తక్షణమే సీట్లను పెంచి పేద విద్యార్థుల విద్యా వికాస ప్రగతికి కృషి చేయాలని కోరారు. పెండింగ్లో ఉన్న విలువలను ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ నేతల ఒత్తిడితో గురుకుల పాఠశాలలో సీట్లను.. కేటాయిస్తూ ఉండడంతో పరీక్ష రాసిన అర్హులైన ప్రతిభవంతులకు సీటు దొరకని పరిస్థితి నెలకొన్నది అన్నారు. నిష్పక్షపాతంగా ప్రతిభావంతులకు చోటు కల్పించి.. ప్రతిభావంతులను చేయూత ఇవ్వాలన్నారు. 15 సంవత్సరాలుగా బీసీ గురుకుల కన్వీనర్ సంగీత కుమారి ఒకే చోట విధులు చేపట్టడం.. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘనకు పాల్పడుతున్న నేటికీ చర్యలు చేపట్టడం, బదిలీ చేయకపోవడం ఉన్నత స్థాయి అధికా రుల పని తీరుకు నిదర్శనం అన్నారు. తక్షణమే ప్రభుత్వం బీసీ గురుకుల కన్వీనర్‌పై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు ధనంజయ, ప్రతాప్, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

## జీవో 117 రద్దు చేయాలి..

### : ఎస్టీయూ నాయకులు

**విశాలాంధ్ర-బుక్కరాయసముద్రం:** ప్రభుత్వ పాఠశాలలో విలీన జీవో 117 వెంటనే రద్దు చేయాలని ఎస్ టి యు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి జి. సూర్యుడు, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి చలపతి పేర్కొన్నారు. గురువారం ఉపరాసముద్రం మండలంలోని వివిధ పాఠశాలలో పర్యటించి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల పునరుద్ధరణ చేపట్టి.. ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ప్రగతికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు . ఈ కార్యక్రమంలో నాయకులు రంగారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు మృత్యాంజయ, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## మారెమ్మ దేవాలయం నిర్మాణానికి విరాళం...

**విశాలాంధ్ర-నల్లమాడ:** మండలంలోని కుటాలపల్లి తండాలో నూతనంగా నిర్మిస్తున్న మారెమ్మ దేవాలయంను గురువారం అమెరికాకు చెందిన డేవిడ్, నెదర్లాండ్ కు చెందిన కుమార్, పుట్టపర్తి జిల్లా కు చెందిన సత్యసాయి బాబా ట్రస్టు రత్నాకర్ పిఎ సతీష్ లు కుటాలపల్లి తండాను సందర్శించడం జరిగింది. గ్రామస్తులు సర్పంచ్ రావత్ భారతి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చాంప్లానాయక్‌లు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల కోరిక మేరకు మారమ్మ దేవాలయం నిర్మాణం కొరకు పైన కనిపరిచిన ముగ్గురు రూ. కోటి రూపాయలు వ్యయంతో దేవాలయం నిర్మించడా నికి ముందు కు వచ్చి హామీ ఇచ్చి భూమి పూజ చేసినట్లు వారు తెలిపారు. అనంతరం ఎం పి యు పి స్కూల్ కుటాలపల్లి సందర్శించి పిల్లలతో మాట మంతి గడిపి ఈసారి వచ్చినప్పుడు పిల్లలకు కావలసిన స్టేషనరీ మొత్తము ఇస్తాము అని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన బ్యాగులు పంపిణీ చేయడం జరిగినది. దివంగత సత్యసాయి బాబా చిత్ర పటానికి పూలమాలలు వేశారు.

## మూగజీవాలకు వైద్య సేవలు

**విశాలాంధ్ర-కళ్యాణదుర్గం టౌన్:** మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లో గ్రామంలో వందలాది మూగజీవాలకు వైద్య సేవలు అందించారు. గురువారం ప్రభుత్వ ఆదేశాల మేరకు పశు వారోత్సవాలను డాక్టర్ శ్రీనివాస గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామ రైతులకు పశుగ్రాస రాసారకాల సాగు వివరాలను రైతులకు వివరించారు. అనంతరం గ్రామ పరిధిలో వందలాది పశువులకు వివిధ రకాల తో బాధపడుతున్న మూగ జీవాలకు వైద్య సేవలు అందించారు. నేడు అందుబాటులో లేని పాడి రైతులు రేపటి నుంచి కళ్యాణదుర్గం పశు వైద్యశాలలో అందుబాటులో ఉంటామన్నారు. పాడి పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఎం రామమూర్తి,పశుగణ సహాయకులు హేమంత్ కుమార్,సుధాకర్ నాయక్,విజయ్‌కుమార్ రవికుమార్ పాల్గొన్నారు.

## పదేళ్లు పార్టీని ఆదరిస్తే అవమానిస్తారా..?

### మాజీ ఎమ్మెల్యే పి వి సిద్దారెడ్డి

**విశాలాంధ్ర-కదిరి:** వైకాపా పార్టీని 10 సంవత్సరాలు ఆదరిస్తే అవమానిస్తారా అంటూ మాజీ ఎమ్మెల్యే డా. పి వి సిద్దారెడ్డి ని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆయన నివాసం లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలకు వ్యతిరేకంగా ప్రవర్తించానన్న ఉద్దేశంతో పార్టీ నుండి నన్ను సస్పెండ్ చెయ్యడం పట్ల విచారణ వ్యక్తం చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఏనాడు తాను వ్యతిరేకంగా ప్రవర్తించలేదని పార్టీనే తనను ఎంతగానో అవమానించిందన్నారు. పది సంవత్సరాలుగా పార్టీని తన భుజస్కందాలపై మోస్తూ కుక్కలు చింపిన విస్తరిలా ఉన్న పార్టీని ఏక తాటికి తీసుకొచ్చనన్నారు. 2014లో పార్టీ నిర్ణయించిన అభ్యర్థిని మంచి మెజారిటీతో గెలిపిస్తే , గెలిచిన రెండు సంవత్సరాల కాలంలోనే అభ్యర్థి పార్టీ ఫిరాయించి పార్టీకి దిక్కులేని సమయంలో తన శక్తికి మించి పార్టీ కోసం పనిచేశామన్నారు.నేను ఏ పదవి ఆశించకుండా పని చేస్తుంటే 2019లో శాసనసభ్యులుగా అవకాశం ఇచ్చిన సమయంలో అఖండమైన మెజార్టీతో విజయం సాధించానన్ని తెలిపారు. అధికారం చేపట్టిన నాటి నుండి 24 గంటలు 365 రోజులు పార్టీని బలోపేతం చేస్తూ కదిరి నియోజకవర్గం అభివృద్ధికి పాటు పడ్డామన్నారు.పార్టీ మారే ఆలోచన ఉందా అని వివరణ కోరగ స్పందిస్తూ స్నేహితులతో శ్రేయోభిలాషులతో నాయకులతో కార్యకర్తలతో చర్చించి తదుపరి కార్యాచరణ త్వరలోనే ప్రకటిస్తానని తెలియజేశారు.

## బిల్లుల కోసం కూలీల ఎదురుచూపు

**విశాలాంధ్ర-శింగనమల:** శింగనమల మండల వ్యాప్తంగా ఉపాధి హామీ పని తొమ్మిది, పది,వారాలు పనిచేసినా ఇంతవరకు బిల్లులు మంజూరు కాకపోవడం శోచనీయమని ఉపాధి కూలీలు వాపోతున్నారు, ఉపాధి బిల్లులు అందక అనేక అవస్థలు పడుతున్నామని, కూరగాయలు నిత్యవసర వస్తువులు ధరలు ఆకాశన్నంటుతున్నాయని, కూలి పనికి పోయి చేతిలో చిల్లి గవ్వలేక, కూరగాయల కొనలేక పస్తులుండాల్సి వస్తోందని, కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, అధికారులను బిల్లులు అడిగితే అనేక సాకులు చెబుతున్నారని, ఆఫీసు చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా మా బాధలు, మా గాధలు, మామొరలు, ఆలకించే నాధుడే కరువయ్యా రని ఉపాధి కూలీలు, అసహనం వ్యక్తం చేస్తూ ఆవేదన చెందుతున్నారు, ఉపాధి బిల్లులకు రాజకీయాలనంటగడుతున్నారని, తొమ్మిది, పది, వారాల నుండి వరుసగా ఉపాధి పనికి వెళుతున్నందున చేతిలో చిల్లి గవ్వలేక, ఉపాధి బిల్లులు బ్యాంకు అకౌంట్లో జమ కాక పూట గడవని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నామని, బిల్లుల కోసం వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తున్నామని, కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉపాధి బిల్లులు మంజూరుచేయాలని కోరుతున్నారు.

## మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలి

**విశాలాంధ్ర-ఉరవకొండ:** ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసు అన్నారు. గురువారం ఉరవకొండ అగ్ని మాపక కేంద్రము ప్రాంగణం నందు సీఐ భీమ లింగయ్య ఆధ్వర్యంలో పలు రకాల, పండ్ల మొక్కలు, పూల మొక్కలు, నాటారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన నాగమల్లి ఓబులేసు మాట్లాడుతూ అగ్నిమాపక కేంద్రం ప్రాంగణమునందు భూమి బాగా లేకపోయినా, నీరు ఉప్పుగా ఉన్న సీఐ భీమ లింగయ్య ఉదార స్వభావంతో ఎర్ర మట్టిని సొంత నిధులతో తెప్పించుకొని మొక్కలు నాటి పెంచాలని ఆలోచించడం పట్ల అభినందనీయమని వారి బృందాన్ని మరియు సీఐని హృదయపూర్వకంగా అభినందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని ప్రకృతిని కాపాడాలని అందుకోసం తాము ఉచితంగా మొక్కలు అందజేస్తామని అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

## పెన్నహోబిలం దేవస్థానంలో వేలం వాయిదా..

**విశాలాంధ్ర-ఉరవకొండ :** అనంతపురం జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయానికి సంబంధించి ఆదాయ వనరుల కోసం గురువారం దేవదాయ శాఖ అధికారులు నిర్వహించిన వేలం పాటలను సరైన ఆదాయం రాకపోవడం వల్ల రద్దుచేసి వాయిదా వేశారు. ఈ సందర్భంగా ఆలయ కార్య నిర్వహణ అధికారి కే. విజయ్ కుమార్ విలేకరులతో మాట్లాడుతూ దేవస్థానము నందు తలనీలాలు ప్రోగు చేసుకోను హక్కు కు 13 మంది డిపాజిట్ కట్టగా రూ.12.50, లక్షల వద్ద వేలంపాట ఆగిందని తెలిపారు. టెంకాయలు అమ్ముకొను హక్కు కు 18 మంది డిపాజిట్ కట్టగా రూ.20 లక్షల వద్ద వేలం పాట ఆగిపోవడం జరిగిందన్నారు. అలాగే కొబ్బరి చిప్పలు సేకరించుకొను హక్కు కు 04 మంది డిపాజిట్ కట్టగా రూ. 4.30 లక్షల వద్ద వేలం పాట ఆగిపోయిందని గతములో కంటే ఈ సంవత్సరము వేలం పాట తగ్గడం వలన ఆదాయం కూడా తగ్గిందని అందుకోసమే పాట నిలుపుదల చేసి వాయిదా వేయడం జరిగినదని ఆయన తెలిపారు. తిరిగి వేలంపాటలను ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి ఉరవకొండ డివిజన్ ఇన్స్పెక్టర్ కె.రాణి ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## దివ్యాంగులకు అందుబాటులో వీల్ చైర్లు

**విశాలాంధ్ర-రాప్తాడు:** ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే దివ్యాంగ రోగులకు వీల్ చైర్లు అందుబాటులో ఉంచడం హర్షణీయమని ఎంపీడీఓ గీతావాణి, డాక్టర్ శివకృష్ణ అన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల ప్రాథమిక ఆసుపత్రులకు పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరాంలు వీల్ చైర్లు అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు వివిధ వ్యాధుల బాధితులు వస్తుంటారని వారు ఇబ్బందులు పడకుండా ఎమ్మెల్యే చొరవ చూపడం సంతోషదాయకం అన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పంపు కొండప్ప, ప్రధాన కార్యదర్శి దగ్గుబాటి శీనా, సర్పంచ్ సాకే తిరుపాలు, నాయకులు గంగలకుంట కిష్ట, గోనిపట్ల శీనా, గేట్ సత్తి, సీహెచ్ఓ శివప్రసాద్, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీధర్, ఫార్మసిస్ట్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం

**విశాలాంధ్ర- రాయదుర్గం అర్బన్:** పట్టణంలోని ఏపిఎస్ ఆర్టీసి డిపోలో గురువారం ఘనంగా ఎంప్లాయిస్ యూనియన్ 73వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్టీసి డిపో మేనేజర్ సురేష్ బాబు. టిడిపి పట్టణాధ్యక్షుడు పసుపులేటి రాజు.సిపిఐ తాలుకా కార్యదర్శి ఎం. నాగార్జులు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ 1952 లో ఎంప్లాయ్ యూనియన్ ఆవిర్భవించిందన్నారు. నేటికీ 73 సంవత్సరాలు అవుతుందని, యూనియన్ ఆవిర్భవించినప్పటి నుంచి నేటి వరకు కార్మికుల పట్ల, శ్రామికుల పట్ల, ఉద్యోగుల విషయాల్లో అనేక పోరాటాలు చేసి వారి సమస్యలను తీర్చే విషయంలో అగ్రస్థానంలో ఉంటూ ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ముందుకు సాగుతోందన్నారు. ఎంప్లాయిస్ యొక్క ప్రయోజనాల కోసం వారి జీతభత్యాలు, వారి యొక్క సమస్యలు తీర్చడంలోన ఎల్లవేళలా ఏపీఎస్ఆర్టీసీ యూనియన్ నాయకులు, ఎంప్లాయిన్ యూనియన్‌కు ఏ కష్టం వచ్చినా ముందుండి పోరాటం చేస్తూ ఎంప్లాయిస్ యూనియన్ యొక్క విధివిధానాలను కొనసాగిస్తున్నారన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం జరుపుకోవడం చాలా సంతోషకరమని, ఎల్లప్పుడూ కార్మికుల వెన్నంటి ఉంటూ వారి సమస్యల పరిష్కారం కొరకు డిఎం నుండి ఆర్ఎం వరకు సమస్యలు తీసుకెళ్లి సమస్యల పరిష్కారం కొరకు నిరంతరం పోరాటం చేస్తున్న ఎంప్లాయిస్ యూనియన్ ఇలాంటి యూనియన్ ఆవిర్భావ దినోత్సవం మరెన్నో జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు శ్రీరాములు, ఎస్ఎస్ వలి రామలింగ, కేటీ రెడ్డి, జగదీష్, ఏఐటీయుసి రాయదుర్గం నియోజకవర్గ ఇంచార్జ్ గురుస్వామి, ఎంప్లాయిన్ యూనియన్ సభ్యులు ఆనందు పాల్గొన్నారు.

## ప్రతి మండలానికి అంబేద్కర్ భవనం నిర్మించాలి..

**విశాలాంధ్ర-కదిరి:** జిల్లాలోని అన్ని మండల్లాల్లో భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ భవనాలు నిర్మాణం చేయాలని రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు మెయిల్ ద్వార పంపినట్లు ఎస్సీ డిపార్ట్మెంట్ జిల్లా చైర్మన్ బి కదిరప్ప తెలిపారు. రాష్ట్రంలోని అత్యంత వెనుకబడిన, కరువు ప్రాంతమైన శ్రీ సత్యసాయి జిల్లాలో ఎస్సీ,ఎస్టీ బీసీ మైనారిటీలకు చెందిన పేద వర్గాల వారు వివాహాలు శుభకార్యాలు చేసుకోవాలంటే ప్రస్తుత పరిస్థితులలో ఫంక్షన్ హాల్స్ కు లక్షలాది రూపాయలు అద్దెలు చెల్లించ ఇబ్బందులు పడుతున్నారన్నారు. సభలు సమావేశాలు నిర్వహించాలన్న అనువైన స్థలం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జిల్లాలో ప్రతి మండల కేంద్రంలో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ భవనమును నిర్మించడం వలన అన్ని వర్గాల పేద ప్రజలు వివాహాలు శుభకార్యాలు , సమావేశాల నిర్వహణకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు.

## నైపుణ్యాలే విజయ్ శిఖరాలు...

**విశాలాంధ్ర - జేఎన్టీయూఏ:** విద్యార్థులకు నైపుణ్యాలు శిఖరాలు అని యు.ఎస్.ఎ శాప్ గ్లోబల్ వైస్ ప్రెసిడెంట్ సౌరబ్ సుమన్ చౌదరి పేర్కొన్నారు. గురువారం అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు పారిశ్రామిక పరిశోధన ఉపాధి కల్పనపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పుస్తక పరిజ్ఞానంతో పాటు.. సమాజంలో ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలకు పరిష్కార మార్గాలను ఇంజనీరింగ్ విద్యార్థులు అన్వేషించి రూపకల్పన చేయగలిగే సామర్థ్యాలు విద్యార్థులకు ఉన్నాయని అన్నారు. సమయ పాలన, పరిశోధాత్మక అధ్యయనం, మిత్రులతో చర్చలు, నాయకత్వ లక్షణాలు, సాంకేతిక నిపుణుల సలహాలు సూచనలను అన్వేషణ చేపట్టాలని విద్యార్థులకు సూచించారు..